సాక్షి సంగారెడ్డి

మంగళవారం। 10। సెప్టెంబర్। 2024



కౌలు కష్టాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడి సాయం అందక, బ్యాంకు రుణాలు రాక కౌలు రైతు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వివరాలు 8లో ▸



వక్ఫ్ భూముల సమస్య..

తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను వక్ఫ్ కిందకు చేర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు 8లో ▸



భారీ వర్షం.. అపార నష్టం

భారీ వర్షాల కారణంగా జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కాళోజీకి ఘన నివాళి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: తెలంగాణ ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజారాణి, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి ఐనేష్ నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ పరమేష్ పాల్గొన్నారు.

'రైతు భరోసా' అమలు చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.2లక్షల రుణ మాఫీని షరతులు లేకుండా అమలు చేయాలన్నారు. అనంతరం రైతులతో కలిసి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నరసింహారెడ్డి మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా సదానంద రెడ్డి, ఉపాధ్యక్షులుగా కృష్ణారెడ్డి ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి: వసతి గృహ సంక్షేమ అధికారుల జిల్లా కార్యవర్గాన్ని సోమవారం స్థానిక టీఎన్జీఓ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకట్ రెడ్డి, కార్యదర్శిగా బద్రి ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా శంకరయ్య, నాగేశ్వరరావు, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా నర్సింలు, శివకుమార్, రవీందర్, రాధిక, సంయుక్త కార్యదర్శులుగా దుర్గేష్, శోభారాణి, రామప్ప, వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం

పటాన్‌చెరు టౌన్: ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి రుద్రారం తోషిబా పరిశ్రమ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ... ఈనెల 11వ తేదీన జరగనున్న ఎన్నికల్లో త్రాసు గుర్తుపై ఓటేసి కూటమి అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రహమాన్, అహమదుల్లా, భూపాల్ రెడ్డి, విజయ్ కుమార్, నర్సింహారెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నిమ్జ్ భూ బాధితులకు పరిహారం



అంగీకార పత్రాలను అధికారులకు అందజేస్తున్న రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): నిమ్జ్‌లో భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించే కార్యక్రమం కొనసాగుతుందని జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హద్నూర్ గ్రామ పంచాయతీలో భూ బాధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 32 మంది రైతులకు సంబంధించిన 112 ఎకరాలు నిమ్జ్‌లో కోల్పోయారు. దీనికి సంబంధించిన పరిహారం రూ.16.83 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సొమ్మును భూ బాధితుల బ్యాంక్ ఖాతాలో అధికారులు జమ చేసినట్లు డిప్యూటీ కలెక్టర్ పేర్కొన్నారు. నిమ్జ్ కోసం భూములు ఇవ్వాలనుకునే రైతులు అంగీకార పత్రాలను తమకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్జ్ డిప్యూటీ తహసీల్దార్లు జనార్దన్, రాచయ్యస్వామి పాల్గొన్నారు.

ఫార్మాసిటీ వద్దని..



కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా, పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

సంగారెడ్డి జోన్: ఫార్మాసిటీ ఏర్పాటుతో రైతులకు అన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్‌కల్ మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ డప్పూర్, మల్గి, వడ్డీ గ్రామాల రైతులు, భూ నిర్వాసితులు, నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయం నిర్వీర్యం అవుతుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు లేవని..



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: వసతి గృహాలు అద్దె భవనాలలో కొనసాగుతుండటంతో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ వాపోయారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వసతి గృహాలలో నాణ్యమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సందీప, సిద్ధు, అనిల్, బన్నీ, స్వాత్విక, మల్లేశ్వరి, వాసు, సౌజన్య, హారిక, నవ్య, శిరీష పాల్గొన్నారు.

పల్లెపోరు కసరత్తు షురూ

ఓటరు తుది జాబితా విడుదల షెడ్యూల్ మార్పు

- రిజర్వేషన్ల మార్పునకు సంకేతాలు
- పల్లెల్లో పెరుగుతున్న ఆశావహులు

జిల్లాలో **647** పంచాయతీలు

నారాయణఖేడ్: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలు రావడంతో అధికార యంత్రాంగం కార్యాచరణలో నిమగ్నమైంది. జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పాలకవర్గం గడువు ముగిసింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు ఓటర్ల జాబితా తయారీలో సిబ్బంది తలమునకలయ్యారు. ఈనెల 6వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించాల్సి ఉండగా, తాజాగా ఈ షెడ్యూల్‌ను మారుస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. మారిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 13వ తేదీన ఓటరు ముసాయిదా ప్రకటిస్తారు. 14వ తేదీ నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో ఎంపీడీఓలు రాజకీయ పార్టీల అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. 28న వార్డుల వారీగా ఓటరు తుది జాబితాను ప్రకటిస్తారు. ఒక వార్డులో 650మంది ఓటర్లు ఉండేలా జాబితా తయారు చేస్తున్నారు. అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒక పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాబితా రూపొందిస్తున్నారు.

మారనున్న రిజర్వేషన్లు

పంచాయతీ ఎన్నికలపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను



ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం తీసుకువచ్చింది. కాగా కొత్త ఓటర్ల జాబితాలకు అనుగుణంగా మళ్లీ రిజర్వేషన్లు మారుతాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రకటించింది. ఈ లెక్కన రిజర్వేషన్లు మారడంతో గతంలో ఉన్న రిజర్వేషన్లు తిరిగి వచ్చే అవకాశం లేదు. దీంతో సర్పంచ్ పదవిపై చాలామంది ఆశలు పెంచుకుంటున్నారు. చాలా వర్గాల నుంచి పోటీ పెరగనుంది. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను రాజకీయ పార్టీలు చేపట్టనున్నాయి. రాజకీయాలకతీతంగా పార్టీ బీ ఫాంపైన కాకుండా స్వతంత్రంగా అభ్యర్థులు బరిలో ఉన్నా రాజకీయ పార్టీల మద్దతు ఉంటుంది. దీంతో తమ పార్టీ బలపర్చిన అభ్యర్థి ఫలానా అంటూ రాజకీయ నేతలు ప్రచారం చేస్తుండడంతో ఈ ఎన్నికల్లోనూ రాజకీయ ప్రభావం అధికంగా ఉంటుంది. ఇప్పటికే ఆయా గ్రామాలకు చెందిన ఆశావహులు పార్టీ నేతల వద్ద పోటీకి సంబంధించిన ప్రయత్నాలు చేపట్టారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే తామూ పోటీకి సిద్ధమంటున్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రజలకు మచ్చిక చేసుకునే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సమావేశం అయ్యారు. రాష్ట్రంలోని 12,966 గ్రామం పంచాయతీలు, వాటి పరిధిలోని 1,14,620 వార్డుల్లో ఎన్నిల ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించామని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తెలిపారు. 13న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తామన్నారు.

అసెంబ్లీ జాబితా ఆధారంగానే..

అసెంబ్లీ ఓటర్ల జాబితా అనుసరించి 2024 ఫిబ్రవరి 20న ప్రచురితమైన జాబితా ఆధారంగానే గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా కొత్త జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఓటర్ల ఫొటోలతో కూడిన తుది జాబితా ప్రచురణ అనంతరం.. వాటిలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపింది. మొత్తం ప్రక్రియ ఎంపీడీఓలు, ఎంపీఓలు తమ పరిధిలోని గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా పర్యవేక్షించనున్నారు. కాగా 2024 జనవరి 1నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

రెవెన్యూ కాలనీ, శ్రీ చక్రకాలనీలలో మంత్రి దామోదర



ఎర్రకుంటలో వరద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి

సంగారెడ్డి: ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వర్షాలకు ముంపునకు గురైన రెవెన్యూ కాలనీ, శ్రీ చక్ర కాలనీలలో పర్యటించి బాధితులను ఓదార్చారు. నీట మునిగిన ఇండ్లను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి పరిశీలించారు. పట్టణానికి ఆనుకొని ఉన్న ఎర్రకుంట, చంద్రయ్య కుంటలలో వరద కాలువలు పూడుకపోవడం, తూము చిన్నగా ఉండడం వలన ఈ రెండు కాలనీలలో భారీగా వరద నీరు చేరిందని తెలిపారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా కాలువల్లో పూడిక తీయాలని నీటిపారుదల శాఖ మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు.

పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి పట్టణాన్ని సిద్దిపేట, వరంగల్, సిరిసిల్ల మాదిరిగా అభివృద్ధి చేసేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పార్కుల సుందరీకరణ, చెరువుల అభివృద్ధి, మినీ ట్యాంక్‌బండ్‌ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాళాల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టా పాస్ బుక్కులు ఇప్పించండి

జహీరాబాద్ మండలానికి చెందిన పలువురు రైతులు కలెక్టరేట్ ఆవరణలో మంత్రిని కలిశారు. తాము సాగు చేసుకుంటున్న భూమిని గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డు నుంచి తొలగించి ఖరీఫ్ కాజా ఖాతాగా మర్చారని తెలిపారు. దీనిపై కోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఆ భూమిని ఖరీఫ్ కాజా ఖాతా నుంచి తొలగించి ధరణిలో చేర్పించాలన్నారు. అలాగే పట్టా పాస్ బుక్కులు అందించాలని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి 15 రోజులలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వారోత్సవాలు జయప్రదం చేయండి



బుక్‌లెట్‌లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సాయుధ పోరాట వారోత్సవాలకు సంబంధించి బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెల్లో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ మతంరంగు పులిమి రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. నాటి స్వాతంత్ర్య, సాయుధ రైతాంగ పోరాటాలతో పాలకులు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, ఈ పోరాటంలో నాలుగు వేల మంది వీరులు ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. పాలకుల దోపిడీని అరికట్టేందుకు సీపీఎం ఆధ్వర్యంలో మరో పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, కృష్ణ పాల్గొన్నారు.

వట్‌పల్లి ఎస్‌ఐపై బదిలీ వేటు

ఠాణాలో కాంగ్రెస్ పార్టీ నాయకుడి బర్త్‌డే వేడుకల ఎఫెక్ట్



లక్ష్మణ్, ఎస్‌ఐ

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడి జన్మదిన వేడుకలు నిర్వహించడంతో ఎస్‌ఐ లక్ష్మణ్‌పై బదిలీ వేటు పడింది. వివరాల్లోకి వెళితే.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ జ్యోషి జన్మదినం సందర్భంగా ఆదివారం వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లక్ష్మణ్, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అంతేకాకుండా పత్రికల్లో వార్త ప్రచురితమైంది. ఈ విషయం హైదరాబాద్ రేంజ్ ఐజీ సత్యనారాయణ దృష్టికి వెళ్లడంతో ఎస్‌ఐని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. లక్ష్మణ్ వట్‌పల్లి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన 20 రోజులకే ఇలా జరగడంపై స్థానికంగా చర్చనీయాంశమైంది. అలాగే ఈ వేడుకల్లో పాల్గొన్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లపై కూడా వేటుపడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారి పేర్లను కూడా ఎస్పీకి పంపినట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు కూడా ఈ విషయమై విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

28న చలో కలెక్టరేట్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం స్వీపర్ సర్వీస్ పర్సన్స్, స్కావెంజర్లను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 28న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు తెలిపారు ఈ మేరకు సోమవానం మండల పరిధిలోని మల్కాపూర్‌లో కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి శివశంకర్, ఏక్బాల్, శ్రీకాంత్, లక్ష్మీ తదితరులున్నారు.

ప్రజావాణికి 96 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 96 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. డీఆర్‌ఓ పద్మజారాణి దరఖాస్తులు స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలు, పింఛన్లు, నష్టపరిహారం తదితర సమస్యలపై అధికంగా విన్నపాలు వచ్చాయి.

పాస్ పుస్తకం ఇప్పించండి



మాది న్యాల్‌కల్ మండలం మామిడ్గి. కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూమిని పంపిణీ చేసి పట్టాను అందించారు. సర్వే నంబర్ 27/1లో 1.13 గుంటల భూమిని తాతల కాలం నుంచి సాగులో ఉన్నాం. ఈ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ కొత్త పాస్ పుస్తకం రాలేదు.

–శోభావతి, జయరాజ్

పరిహారం అందించాలి



మాది న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్ గ్రామం. నిమ్జ్ కోసం మా భూములు తీసుకున్నారు. మా భూమిలో మామిడి, చింత, వేప, నీలగిరి తదితర వృక్షాలకు సంబంధించి నష్టపరిహారం ఇవ్వాలని కోరినా అధికారులకు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.

– రైతులు మొగులప్ప, చంద్రప్ప, నర్సింలు

భూమి పట్టాలు ఇప్పించండి



మాది ఝరా సంగం మండలం బిడెకన్నె గ్రామం. 40ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తమకు భూములతో పాటు సర్టిఫికెట్లను ఇచ్చింది. గత ప్రభుత్వం కొందరికి కొత్త పట్టా పాస్ బుక్కులు అందించింది. మాకు రాలేదని తెలిపారు. – కిష్టయ్య, రాజు, పుణ్యమ్మ, తుల్జమ్మ, ఈరన్న, సిద్ధన్న

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రైతులు దళారుల బారినపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులను అమ్ముకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. మనూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసర కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. క్వింటాలుకు రూ.8,682కు మద్దతు ధర చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం నిర్వాహకురాలు స్వప్న, బ్రహ్మానందరెడ్డి, గుండేరావు, సిద్దారెడ్డి, రాజు పాల్గొన్నారు.

బీజేపీ వైపే యువత చూపు



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందించడంలో విఫలమైందని, ఎంపీ ఎన్నికల ఫలితాలలో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగైపోవడంతో ప్రతీ ఒక్కరి చూపు బీజేపీ వైపు ఉందని ఆ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి బసవపురం లక్ష్మీనర్సయ్య అన్నారు. సోమవారం పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి ప్రధాని మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సభ్యత్వం కోసం 8800 0024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.. అనంతరం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెవెన్యూ కాలనీలో వరద నీటిలో మునిగిన ఇళ్లను వారు పరిశీలించారు. వారికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, అదిరి రవీందర్, ఎడ్ల రమేష్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి

కొండాపూర్(సంగారెడ్డి): భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మునిదేవునిపల్లిలో నీట మునిగిన పంటలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలు నీటిలో మునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బాబూరావు, గోపాల్, నర్సింలు మాణయ్య, శీను, చంద్రయ్య, శివలింగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పోలీసులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తలారువాని పల్లె గ్రామ శివారులో నిల్వ ఉంచిన సుమారు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బెజ్జంకి ఎస్ఐ క్రిష్ణారెడ్డి సోమవారం తెలిపారు. నిందితుడు సురేశ్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పీడీఎస్ రైస్, గంజాయి, తదితర నిషేధిత వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు.

కండక్టర్ పర్సుకే కన్నం

టికెట్ల డబ్బులు ఎత్తుకొని దొంగ పరారీ

జోగిపేట(అందోల్): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల వద్ద నుంచి దొంగతనం చేయడం విన్నాం కానీ కండక్టర్ బ్యాగులో నుంచే నగదును అపహరించుకున్న ఘటన సోమవారం సాయంత్రం జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెదక్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తుండగా మార్గమధ్యలోని జోగిపేట బస్టాండ్‌లో ఆగింది. ప్రయాణికులు బస్సులోకి ఎక్కుతూ.. దిగుతున్న క్రమంలో కండక్టర్ త్రిమూర్తులు బ్యాగులో ఉన్న నగదును గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. కొద్దిసేపటి కండక్టర్ బ్యాగులో చెయ్యి పెట్టి చూడగా డబ్బులు కనిపించలేదు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అయినా ఎటువంటి ఆధారాలు లభించలేదు.టికెట్ల డబ్బులను కౌంట్ చేయగా రూ.8 వేలు తక్కువగా రావడంతో కండక్టర్ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పాండు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


పంటను పరిశీలిస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): పత్తి పంటలో ఎండు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా.రాహుల్ విశ్వకర్మ, సరిత సూచించారు. సోమవారం మండల పరిధిలోని గట్‌పల్లి, వట్‌పల్లి గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించి ఎండు తెగులు సోకినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి చేలల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ కల్యాణ్, రైతులు పాల్గొన్నారు.

డెంగీతో బాలుడు మృతి

భయాందోళనలో కొన్యాల వాసులు



హత్నూర(సంగారెడ్డి): డెంగీతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన బాలుడు చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం కుమారుడు దశ్విక్(45 రోజులు) మూడు రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పట్టణంలోని శిశురక్ష ఆస్పత్రికి తరలించారు. బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. వైద్యులు సరైన సమయంలో చికిత్స చేయకపోవడం తోనే బాలుడు మృతి చెందాడని తండ్రి ప్రభులింగం ఆరోపించాడు.

కౌలు కష్టాలు

కౌలు రైతులు కష్టాల కడలిలో ఈదుతున్నారు. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడి సాయం అందక, అటు బ్యాంకు రుణాలు రాక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వడ్డీలకోర్చి రూ.వేలల్లో కౌలుకు తీసుకొని అష్టకష్టాలు పడి పంట సాగు చేస్తే చివరికి ప్రకృతి కన్నెర్ర చేయడంతో దిగుబడి రాక నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పెట్టుబడి సాయం, రైతు బీమా కల్పించాలని జిల్లాలోని వేలాది మంది రైతులు కోరుతున్నారు.

- ఎకరానికి సుమారు రూ.15 వేలు
- అందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు
- బ్యాంకులు సైతం రుణాలకు విముఖత
- జిల్లాలో 30 వేల పైచిలుకు కౌలు రైతులు
- పెట్టుబడి సాయం అందించాలని వేడుకోలు



మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని 21 మండలాలు ఉండగా 5 అగ్రికల్చర్ డివిజన్లు, 76 క్లస్టర్ల పరిధిలో 3,97,480 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 2,21,623 మంది పట్టాలు కలిగిన రైతులు ఉన్నారు. ఇందులో పదెకరాల వ్యవసాయ భూమి కలిగిన రైతులు 183 మంది, 4 నుంచి 10 ఎకరాలున్న రైతులు 1,950 మంది, 2 నుంచి 4 ఎకరాలు కలిగిన రైతులు 10,449 మంది, 1 నుంచి 2 ఎకరాలు కలిగిన రైతులు 41,887 మంది, ఎకరం లోపు ఉన్నవారు 1,67,154 మంది ఉన్నారు. ఇందులో చాలా మంది పట్టాదారులు తమ భూములను కౌలుకు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు.

కౌలు రైతులు 30 వేలకు పైగానే

జిల్లాలోని హవేళిఘనపూర్ మండలం మద్దుల్వాయి గ్రామంలోనే 15 మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరు రెండెకరాల నుంచి సుమారు 18 ఎకరాల వరకు కౌలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 469 గ్రామ పంచాయతీల్లో సుమారు 30 వేల వరకు కౌలు రైతులు ఉంటారని అంచనా. వ్యవసాయంపైనే ఆధారపడిన వ్యవసాయ కూలీ రైతులు గ్రామాల్లో స్థానికంగా ఉండని వ్యక్తుల పొలాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరిలో చాలా వరకు పేదవారే. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోవడంతో పంటల సాగుకోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి పెట్టుబడులు పెడుతూ వ్యవసాయం చేస్తున్నారు. భూ యజమానులకు రైతు భరోసా, రైతుబీమా ఉంటాయి. కానీ కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి గుర్తింపు లేదు.

ఎకరాకు రూ.6 వేల నుంచి 15 వేల వరకు

జిల్లాలో నీటి ఆధారాన్ని బట్టి ఎకరాకు రూ.6 నుంచి రూ.15 వేల వరకు కౌలు డబ్బులు చెల్లిస్తున్నట్లు సమాచారం. దిగుబడి వచ్చినా.. రాకపోయినా.. పంట పండినా.. ఎండినా... భూ యజమానులకు తప్పనిసరిగా కౌలు డబ్బులు చెల్లించాల్సిందే. పంట ప్రారంభం మొదలు దున్నకల, ఎరువులు, కూలీల ఖర్చులు ఇలా అన్ని కలిపి ఎకరానికి రూ.38 వేలకు పైగా పెట్టుబడి ఖర్చు వస్తుంది. చివరికి ప్రకృతి వైపరీత్యాలతో పంట పోతే కష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి మరీ పెట్టుబడులు పెట్టి వసాయం చేస్తున్న కౌలు రైతులు అప్పులు, వడ్డీలు చెల్లిస్తూ చివరకు నష్టాల పాలవుతున్నారు.

ఆరు గ్యారంటీలతో ఆశలు..

ప్రభుత్వం తమను గుర్తించి పెట్టుబడి సాయం సంక్షేమ పథకాలు లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం కౌలు రైతులకు ప్రత్యేకంగా పెట్టుబడి సాయం అందిస్తామని, గుర్తింపు కార్డులు ఇస్తామని, ఇందుకోసం సర్వే చేయిస్తామని తెలిపింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ఆరు గ్యారంటీల పత్రంలో కౌలు రైతుల గురించి వివరాలు అడిగారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందించడం లేదు. కౌలు రైతుల విషయమై జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌ను వివరణ కోరగా తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. కౌలు రైతుల సర్వే చేయాలని ఎలాంటి సమాచారం లేదని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే సర్వే చేయనున్నట్లు తెలిపారు.

ఏమి మిగలడం లేదు



వ్యవసాయమే జీవనాధారం మాకు. తెలిసిన వారి పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాలి. పంటలు చేతికి రాగానే అసలు, మిత్తీలు కట్టాలి. ప్రభుత్వం కౌలురైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– తగరం అబ్బయ్య, కౌలురైతు, పిట్లంబేస్, మెదక్

పెట్టుబడి సాయం ఇయ్యాలి



నాకు గుంట భూమి లేదు. మా ఊరిలోనే కొందరి భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. ప్రతీ ఏడాది పెట్టుబడులకు ఖర్చు పెరుగుతూనే ఉంది. అయినా వ్యవసాయం తప్ప మరొకటి తెలియక కౌలు కే చేస్తున్నా. ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో పెట్టుబడుల కోసం అప్పులు చేయక తప్పడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– గుద్దంల రాము, మద్దుల్వాయి గ్రామం, హవేళిఘణాపూర్

మర్కటమా.. మజాకా..!


పాఠశాల బయట విద్యార్థులు


కోతుల మంద

- పాఠశాల ఆవరణలో కోతి మృతి
- ప్రధాన గేటు వద్దకు చేరుకున్న కోతుల మంద
- విద్యార్థులు, ఉపాధ్యాయులను లోనికి వెళ్లనీయని వైనం

శివ్వంపేట(నర్సాపూర్): పాఠశాల ఆవరణలో కోతి మృతి చెందడంతో తోటి కోతుల మందగా చేరి ఉపాధ్యాయలు, విద్యార్థులను లోనికి వెళ్లనీయలేదు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి చెండిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణలో సోమవారం కోతి మృతి చెందడంతో తోటి కోతుల మంద ప్రధాన గేటు వద్ద చేరాయి. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులను లోనికి వెళ్లనీయలేదు. దీంతో విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎంఈఓ బుచ్చనాయక్.. గ్రామస్తుల సహకారంతో కోతుల మందను తరిమికొట్టి మృతి చెందిన కోతిని పాఠశాల ఆవరణ నుంచి తొలగించారు. అనంతరం ఉపాధ్యాయులు లోనికి వెళ్లి కూర్చున్నారు.

దొంగతనం నెపంతో దాడి

- తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి
- ఇద్దరు యువకులు అరెస్టు


నిందితులను చూపుతున్న పోలీసులు

తూప్రాన్: దొంగతనం నెపంతో ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఇద్దరు యువకులు విచక్షణా రహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతికి కారకులైన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం తూప్రాన్‌లో డీఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. శివ్వంపేట మండలం గోమారంలో ఈ నెల 4వ తేదీన ఓ గుర్తు తెలియని వ్యక్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెంది పడి ఉన్నాడని గ్రామ పంచాయతీ కార్యదర్శి మన్నే కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించి నిందితులను గుర్తించాం. గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి తిరుపతిరెడ్డి, పందిముక్కల మణికంటగౌడ్ అనే ఇద్దరు యువకులు గోమారం చౌరస్తాలోని బస్ స్టాండ్ వద్ద దొంగ అని భావించి ఓ వ్యక్తిని చితకబాదారు. తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతికి కారకులైన ఇద్దరిని సోమవారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయండి

కలెక్టర్‌కు కోమట్‌పల్లి గ్రామస్తులు, గిరిజనులు వినతి


నిరసన తెలుపుతున్న కోమట్‌పల్లి గ్రామస్తులు

మెదక్ కలెక్టరేట్: ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు.. కానీ ఉపాధి పనులు చూపిస్తలేరని, తామెట్ల బతకాలని కోమట్‌పల్లి గ్రామస్తులు, గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రామాయంపేట మున్సిపాలిటీలోని 2వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోమట్‌పల్లి, వడ్డెర కాలనీ, గిరిజన తండాలను రామాయంపేట మున్సిపాలిటీలో కలిపి 2వ వార్డుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కానీ మాకు ఎలాంటి వసతులు కల్పించడం లేదని, ఇంటి పన్నులు, నల్లా పన్నులు అంటూ బెదిరించి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడు ఉపాధి పనులు దొరికేవి, ఇప్పుడు ఎలాంటి పనులు లేకుండా పోయాయని, తాము ఎట్లా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మమ్ములను రామాయంపేట మున్సిపాలిటీ నుంచి తొలగించి ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు.

కారు, బైక్ ఢీ ఒకరు మృతి


గణేశ్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పాపన్నపేట మండలంలో శానాయిపల్లి శివారులో సోమ వారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. ఘనపూర్ మండలం చొట్లపల్లికి చెందిన చీమల గణేశ్(26) పాపన్నపేట మండలం లక్ష్మీనగర్‌లోని ఐసీఐసీఐ బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు ని ర్వహిస్తున్నాడు. సోమవారం రా త్రి మెదక్ నుంచి లక్ష్మీనగర్ వస్తున్నాడు. ఏడుపాయల నుంచి మెదక్ వైపు వెళ్తున్న కారు గణేశ్‌ను ఢీకొట్టంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...

సంగారెడ్డి టౌన్ : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి భార్య చంపాబాయి కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన ప్రకాశ్(28) గణపతుల విగ్రహాలను తయారు చేస్తూ పోతిరెడ్డి పల్లిలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రకాశ్ సోమవారం ఉదయం శిల్ప వెంచర్‌లోని నీటి గుంతలో మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు..

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘట న రాజ్‌పేటలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజ్‌పేట గ్రామానికి చెందిన పోచయ్య(60) గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గ్రామంలోని ఓ వార్డులో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద విద్యుత్ వైర్లు తెగిపోయి పడి ఉన్నాయి. ఇది గమనించని పోచయ్య రోడ్డు శుభ్రం చేస్తున్న క్రమంలో కాలుకు వైరు తగిలి కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రామవ్వ ఉన్నారు.

డివైడర్ లైటింగ్ స్తంభానికి ఢీకొని...

సదాశివపేట(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం రాళ్లగుడుపల్లి గ్రామ పరిధిలోని గుట్టమీది తండాకు చెందిన మేఘవత్ శ్రీనివాస్(28) ఆదివారం పని నిమిత్తం సంగారెడ్డికి వచ్చాడు. పని ముగించుకొని రాత్రి తిరిగి బైక్‌పై వికారాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో పట్టణ పరిధిలోని వికారాబాద్ రోడ్డు రావుస్ స్కూల్ ఎదురుగా గల డివైడర్ లైటింగ్ స్తంభానికి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

నిషేధిత జాబితాలోంచి తొలగించండి


కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ లక్ష్మీ, రైతులు

- మా భూములకు లోన్లు ఇప్పించండి
- కలెక్టర్‌కు రైతుల విన్నపం

అక్కన్నపేట(హుస్నాబాద్): మా భూములు ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో నమోదయ్యాయని, వెంటనే అందులోంచి తొలగించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ మను చౌదరికి మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీ ఆధ్వర్యంలో నందారం, కపూర్‌నాయక్‌తండా గ్రామ రైతులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నందారం గ్రామ పరిధిలోని దాదాపు 932 ఎకరాలకుపైగా వ్యవసాయ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు రుణమాఫీ చేసి నూతన క్రాప్‌లోన్లు సైతం ఇచ్చారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రుణమాఫీ చేశారు కానీ నూతనంగా క్రాప్‌లోన్లు ఇవ్వడంలేదని తెలిపారు. కార్యక్రమంలో రైతులు మాలోతు కనకనాయక్, అజ్మీర తిరుపతినాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్, మాలోతు సత్యంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాను రాజకీయాలకు వాడొద్దు

- ఎవరి మెప్పు కోసం హైదరాబాద్ సీపీ బదిలీ
- మునిగే బీఆర్ఎస్‌తో పొత్తా..?
- పార్టీ సభ్యత్వ నమోదులో ఎంపీ రఘునందన్‌రావు


సభ్యత్వం తీసుకుంటున్న మహిళా న్యాయవాది

సిద్దిపేటజోన్: ఎవరి మెప్పు కోసం ఐపీఎస్‌లను బదిలీ చేశారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేటలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ ముందు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మార్పు ఎందుకు జరిగిందని నిలదీశారు. ఎంఐఎంకు వ్యతిరేకంగా సీపీ శ్రీనివాస్‌రెడ్డి పని చేసినందుకు బదిలీ చేసినట్లు తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. హైడ్రా పేరిట జరుగుతున్న కూల్చివేతలు దారి మళ్లించే ప్రక్రియ జరుగుతోందని, ఓవైసీ కనుసన్నల్లో నడవొద్దని ఎంపీ సూచించారు. ప్రస్తుతం హైడ్రా మార్పులు అని ఒక కొత్త కథ నడుస్తుందని, రంగు, వేషం మార్చి హైడ్రాను నిర్వీర్యం చేయొద్దన్నారు. నీటి వనరుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, హైడ్రాను రాజకీయాల కోసం వాడొద్దని సూచించారు. ఇతర పార్టీల తరహాలో బీజేపీలో కుటుంబ రాజకీయాలు ఉండవన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య పొత్తు అని ఒక ప్రచారం జరుగుతోందని, మునిగే పార్టీతో పొత్తు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ వంద మంది కొత్త సభ్యులను బీజేపీలో చేర్పించే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, కనకయ్య, బీజేపీ నాయకులు రామచంద్రరావు, జనార్దన్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాలపై సర్వే చేయాలి

మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్


మాట్లాడుతున్న పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): పదిహేను రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి, మిరప, మొక్కజొన్న, సోయా, మినుము పంటలకు తీవ్ర నష్టం ఏర్పడిందని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంజీరా రైతు సమాఖ్య కార్యాలయం వద్ద మాట్లాడారు. భారీ వర్షాలకు పంట నష్టం వివరాలను సర్వే చేసి పూర్తి నివేదిక పంపించాలని ప్రభుత్వం వ్యవసాయ అధికారులను ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యం వహించి నేటి వరకు పంట నష్టం వివరాలు సేకరించలేదని వాపోయారు. కార్యక్రమంలో మంజీరా రైతు సమాఖ్య నాయకులు వెంకట్రావు, రాంరెడ్డి, జ్ఞానోభ, నర్సింహారావు, విఠల్ పాల్గొన్నారు.

రూ.20 వేలు పరిహారం ఇవ్వాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామ శివారులో వర్షాలతో పాడైన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరి,పత్తి,మొక్కజొన్న, పెసర, మినుము,కంది వంటి పంటలు దెబ్బతిన్నాయని, ఎకరాకు రూ.20 వేల నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శశిధర్, బస్వరాజ్, సంగన్న, మల్లన్న, వీరన్న, రజినీ కాంత్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, మనీలాండరింగ్ పేరుతో భారీ మోసం

రూ.4.93 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని సాయి అనురాగ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 17న కొరియర్ వచ్చిందని, దాంట్లో డ్రగ్స్ ఉన్నాయని, కొరియర్‌కు మీ ఆధార్ లింక్ ఉందని ఫోన్ చేసి భయభ్రాంతులకు గురి చేశారు. అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా బాధితుడు స్కైప్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులు ఢిల్లీ పోలీస్ యూనిఫామ్‌లో వచ్చి నీపై ఎంక్వైయిరీ జరుగుతుందని, నీ వద్ద ఉన్న డబ్బు తాము చెప్పిన ఖాతాలో వేయాలని బెదిరించారు. బాధితుడు రూ.4.93 లక్షలు వేశాడు. అపరిచిత వ్యక్తి ఇంకా డబ్బులు వేయాలని అడుగడంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఉద్యోగి నుంచి రూ.15.82 లక్షలు..

టాస్కులు కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ జన్మభూమి కాలనీ ఫేస్–2కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టాస్కులు, కమీషన్ పేరుతో సెప్టెంబర్ 2న మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేయగా, టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతోపాటు కమీషన్ వస్తుందని నమ్మించారు. ఉద్యోగి పలు దపాలుగా రూ.15.82 లక్షలు వేశాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు.బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందు సైబర్ క్రైం పోలీసులకు, సోమవారం పటాన్ చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వక్ఫ్ భూముల సమస్య పరిష్కారానికి కృషి

- రైతు హక్కుల సాధన సమితి కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి
- 11న భూ బాధితులతో అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

జహీరాబాద్: తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ వస్తున్న భూములను అమాంతంగా వక్ఫ్ కిందకు చేర్చి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జహీరాబాద్‌లోని అతిథి ఇన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు హక్కుల సాధన సమితి కన్వీనర్ పీ.వెంకటేశ్వర్‌రెడ్డి, రైతులు మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలో సుమారు 13 వేల ఎకరాల భూములను వక్ఫ్ కిందకు చేర్చి రైతులను అవస్థలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ భూములకు సంబంధించి ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంట్ కమిటీ ఈ విషయాన్ని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. వక్ఫ్ భూ బాధితుల సమస్యలను వినేందుకు గాను 11వ తేదీన జేపీసీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ జహీరాబాద్‌కు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని భూ బాధితులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటారన్నారు. 2018 సంవత్సరం వరకు రైతులు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు ఉన్నాయన్నారు. అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయన్నారు. ఆ తర్వాత ధరణి తీసుకు రావడంతో వక్ఫ్ కిందకు చేర్చారన్నారు. ఈ సమస్యకు ఇప్పటికైనా శాశ్వతంగా పరిష్కరించి ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారు. ఇప్పటికే రైతులతో సంతకాల సేకరణ చేపట్టి పూర్తి చేసినట్లు వివరించారు. వీటిని జేపీసీ కమిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు హక్కుల సాధన సమితి నాయకులు కుర్షిద్, సీ.జగన్నాథ్‌రెడ్డి, మాణయ్య, వీరారెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి, బోగ బస్వరాజ్, కౌసర్, అన్వీరప్ప, కె.రవీందర్, మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.